చతుర - ఫిబ్రవరి, 1982

"బయట ఘోస్ట్‌లను ఆదరించడం మొదలుపెడితే అవి
ఇంటికి గెస్ట్‌లయ్యే అవకాశముంది-"

# ఘోస్ట్

సుబ్బయ్య పేరు బాగా లేకపోయినా అతడికి మిగతావన్నీ బాగానే ఉన్నాయి. ఆ పేరు కలిసొచ్చిందని అతను ఎందరు చెప్పినా మార్చుకోలేదు.

ఆస్తి తప్ప మరే అందమూ లేని అతడు తలిదండ్రులకు ఏకైక వంశాంకురం. ఆ వంశాంకురం నుంచి రానున్న అంకురాలు అందచందాలతో వెలిగిపోవాలని అతని తల్లిదండ్రుల ఆశ. సుబ్బయ్య పిల్లలకు అందం రావాలంటే అందమైన పెళ్ళాం తప్ప మరో మార్గం లేదు. అందుకని ఓ అపురూప సౌందర్యవతికి భర్త కాగలిగాడు. డబ్బుంటే ఏది రాదు గనుక.

తన పేరు విరివిగా ప్రచారం పొందాలని సుబ్బయ్య తపన. తను తెచ్చుకోలేని పేరు తన కొడుకు తెచ్చుకున్నా చాలన్నది అతడి కోరిక. అయితే అతడికి సంతానం కలగడం లేదు. సంతానం కోసం చాలామంది దేవుళ్ళకు మొక్కాడు. డాక్టర్ల చుట్టూ తిరిగాడు. ఫలితం కనపడలేదు.

అన్ని విధాలా నిరుత్సాహపడి ఉన్న సుబ్బయ్య ఇంటికి రమణ వచ్చాడు.

రమణ ఆ ఇంట్లో వారం రోజులుండి సుబ్బయ్య సంపదలు పల్లెటూళ్ళో వృథా అయిపోతున్నాయని బాధపడ్డాడు. డబ్బుంటే ఈ రోజుల్లో ఎంత పేరైనా సంపాదించు కోవచ్చునని రమణ అనగానే అత్రపడిపోయిన సుబ్బయ్య "ఒక్క ఉపాయం చెప్పు నాకు!" అన్నాడు.

"సినిమా తియ్" అన్నాడు రమణ. రమణ సుబ్బయ్యకు వరుసకు తమ్ముడవుతాడు. అతన్ని నమ్మి మద్రాసుకు మకాం మార్చాడు సుబ్బయ్య.

ఫలితం చాలా తొందరగానే కనబడింది. సుబ్బయ్యపేరు పేపర్లో పడింది. చాలామంది అతడి చుట్టూ తిరగసాగారు. ఎందరో ఆడపిల్లలు వేషాల కోసం ఏకాంతంలో కూడా కలుసుకుని అతడి అందాన్ని పొగిడి తమ అందాలనతడికర్పించడానికి తహతహలాడారు. నిర్మాత సుబ్బయ్య తీసిన తొలి చిత్రం విడుదలైంది. చిత్రానికి కాస్తో కూస్తో పేరు కూడా వచ్చింది. సుబ్బయ్యకు పెట్టుబడి పోనూ రెండు లక్షలు లాభం మిగిలింది.

ఈ విధంగా తన పేరు దేశమంతటా మోగిపోతుందని సుబ్బయ్య ఆశించాడు కానీ ఊహించినంతగా మాత్రం అతడికి పేరు రాలేదు. చిత్రంలోని నటీనటులకీ, దర్శకుడికీ, సంగీతదర్శకుడికీ, కథారచయితకూ వచ్చినంతగా తనకు పేరు రాలేదు. అదేమాట అన్నాడతను రమణతో.

రమణ బాగా ఆలోచించి "ఈసారి తీయబోయే చిత్రానికి కథ నువ్వే రాయి"

అన్నాడు.

"నేను కథ రాయగలిగితే పేరు కోసం నిన్నెందుకాశ్రయిస్తాను?" అన్నాడు సుబ్బయ్య.

రమణ నవ్వి "కథ నువ్వే రాయక్కర్లేదు. పేరు మోసిన రచయితలెందరో దేశంలో ఉన్నారు. ఓ రెండు వేలు నీవి కావనుకున్నావంటే నీ పేరనే వాళ్లు కథ రాసిస్తారు" అన్నాడు.

తర్వాత ఇద్దరూ కలిసి ఓ మహారచయిత దగ్గరకు వెళ్ళారు. ఆయన ఎగిరి గంతేసి మరీ కథ రాసిచ్చాడు.

"నీ కథ చాలా బాగుంది. ఈ పిక్చర్ హిట్టయితే ఇకనుంచీ సుబ్బయ్యగారికి నువ్వే పర్మనెంట్ ఘోస్ట్ రైటర్వి" అన్నాడు రమణ రచయితతో.

ఈ రెండో చిత్రం కూడా హిట్టయింది. ఈ చిత్రంలో కథ కంటే సంభాషణలకు పేరెక్కువ వచ్చింది. దాంతో తర్వాత చిత్రానికి సుబ్బయ్య ఓ ఘోస్ట్ డైలాగ్ రైటర్ని కుదుర్చుకున్నాడు.

అలా అయిదారు చిత్రాలు గడిచేసరికి సుబ్బయ్యకు దేశంలో చాలా పేరు వచ్చింది. అతడిప్పుడు చిత్ర నిర్మాత మాత్రమే కాక కథకుడు, సంభాషణల రచయిత, దర్శకుడు, పాటల రచయిత కూడా అయ్యాడు.

"కథ, మాటలు, పాటలు, స్క్రీన్ ప్లే, నిర్మాత, దర్శకుడు - సుబ్బయ్య" అన్న ప్రకటనను పేపర్లో చూసినపుడల్లా సుబ్బయ్య తనలో తనే ముసిముసిగా నవ్వుకుని ఆ ఘోస్ట్‌ల మీద జాలిపడే వాడు. ఒకరోజు సుబ్బయ్య ఏదో షూటింగుకని వెళ్ళి అనుకోకుండా అది కాన్సిలవడం వల్ల వెంటనే ఇంటికి తిరిగి వచ్చాడు. అతను తిరిగి వచ్చేసరికి గదిలో భార్య ఒంటరిగా లేదు. అందమైన ఓ యువకుడి బాహుబంధాల్లో ఉంది. సుబ్బయ్యను చూస్తూనే ఆ యువకుడు కంగారుపడి దొడ్డిదారిని పారిపోయాడు.

"ఎవడు వాడు?" అన్నాడు సుబ్బయ్య ఉద్రేకంతో ఊగిపోతూ.

అతడి భార్య తలవంచుకుని నిలబడింది. వంచిన తల ఎత్తలేదు, పెదవి విప్పి మాట్లాడలేదు. "ఇదంతా ఏమిటో చెప్పు".

"చెప్పడానికేముంది? ఇన్నేళ్ళయి మన పెళ్ళి జరిగినా మనకింకా సంతానంలేదు. అంతా మీగురించి ఏదోలా అనుకుంటుంటే వినలేక అతని పరిచయం పెంచుకున్నాను. అతని వల్ల సంతానవతినైతే మీకున్న చెడ్డపేరు పోతుందని అనుకున్నాను. నాకిప్పుడు మూడవ నెల" అన్నదామె నెమ్మదిగా.

"నా మీద అంత ప్రేమున్నదానివి ఈ విషయం నాకు ముందే ఎందుకు చెప్పలేదు?" భార్య తన నేరాన్ని కప్పి పుచ్చుకునేందుకు ఏదో కథ అల్లుతున్నదని అతడికర్థమయింది.

ఆమె జవాబివ్వలేదు.

"ఇంతకీ ఎవడువాడు?" - రెట్టించాడు సుబ్బయ్య

"మీ ఘోస్ట్ హజ్‌బెండ్!" అందామె.

✦ ✦ ✦